క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే 'ఆత్మీయ పలకరింపు'

యాలాల: 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రోహిత్ మండలంలో బుధవారం పర్యటించనున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు రాస్నం గ్రామం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో పార్టీ గ్రామాల ముఖ్య నాయకులు, క్రియాశీల కార్యకర్తలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు భారీగా పాల్గొనాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మోమిన్‌పేట: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శైలజారెడ్డి కోరారు. మంగళవారం మోమిన్‌పేట గ్రామ పంచాయతీ, బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, ప్రతిరోజు ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది ట్రాక్టరుతో చెత్త సేకరణకు వస్తారని, వారికి ఇవ్వాలని సూచించారు. గతంతో పోలిస్తే సీజనల్ వ్యాధులు తగ్గాయని, ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్ లక్ష్మి ఉన్నారు.

బీఆర్ఎస్ మండల గౌరవ అధ్యక్షుడిగా మల్లారెడ్డి



యాలాల: బీఆర్ఎస్ పార్టీ మండల గౌరవ అధ్యక్షుడిగా పగిడియాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మల్లారెడ్డిని నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆయన పేరును సోమవారం ప్రకటించారు. గతంలో పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహించిన ఆయన్ను గౌరవ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పట్నం వర్గానికి పార్టీ పదవులు

తాండూరు: నియోజకవర్గంలోని 5 మండలాలు, మున్సిపాలిటీలోని పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులకు బీఆర్ఎస్ పార్టీ పదవులను కట్టబెట్టింది. ఇటీవల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు ఒక్కటికాగా.. పట్నం వర్గీయులకు పార్టీలో సముచిత స్థానం ఇచ్చేందుకు అధికార పార్టీ సిద్ధమయింది. అందులో భాగంగానే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అవకాశం కల్పించారు. పార్టీ తాండూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు, పెద్దేముల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.వై.నర్సింహులు, యాలాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్‌రెడ్డి, తాండూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డె శ్రీనివాస్, బషీరాబాద్ మండలానికి శంకర్‌రెడ్డిలు నియమితులయ్యారు.

రైతు సంక్షేమానికి కృషి

దోమ: రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు అన్నారు. మంగళవారం దోమ మండలం బొంపల్లిలో కృష్ణా జలాల నుంచి కలశంలో తీసుకువచ్చిన నీటిని శివాలయంలో శివునికి జలాభిషేకం చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి, పాలమూరు ప్రాంత రైతులకు, ప్రజలకు సాగు, తాగు నీరు అందించేందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మిస్తున్నారని, త్వరలో పరిగితో పాటు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సాగు నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హలీం, ఉపసర్పంచ్ రఫిక్ పాష, వార్డు సభ్యులు బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు వెంకటయ్య, నర్సింహరెడ్డి, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ షేర్‌ఖాన్, బీఆర్ఎస్ నేతలు సంగయ్య, వెంకటేశ్, రమేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక

అనంతగిరి: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందజేసే డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు 2023కు వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన సురేష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో ఆ సంస్థ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా వచ్చే నెల 15న జరిగే అవార్డు ప్రదానోత్సవ ఆహ్వానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, అందుకు సహకరించిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

చెరువు తూము లీకేజీ

ధారూరు: పంటలకు అందించాల్సిన నీరు చెరువు నుంచి నీరు వృథాగా పోతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ధారూరు మండలం రాంపూర్‌తండా సమీప బమ్మన్‌కుట చెరువు తూము నుంచి నీరు లీకేజీ అయి వృథాగా పోతుందని, వెంటనే నీరు వృథాగా పోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ విజయకుమార్ డిమాండ్ చేశారు.

మాన్యాలున్నా.. నైవేద్యం సున్న!

మాన్యాలున్నా పలు ఆలయాలు అభివృద్ధికి కాదు కదా.. కనీసం ధూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. యేటేటా భూముల ద్వారా వస్తున్న ఆదాయాన్ని తన ఖాతాలో జమ చేసుకుంటున్న రాష్ట్ర దేవాదాయ శాఖ.. దేవాలయాల అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా.. నైవేద్యాల గురించి ఆలోచించడం లేదనడానికి బాలాజీ, మానిక్ ప్రభు మందిరాలే సాక్ష్యం.

- నిధుల లేమితే ఉత్సవాలు మమ
- భూములను వేలం వేయని దేవాదాయ శాఖ
- నిరుపయోగంగా భూములు
- ఆదాయం లేక ఆదరణకు నోచుకోని ఆలయాలు



వేంకటేశ్వరాలయం

మోమిన్‌పేట: దేవుడి ఆధీనంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులున్నా.. ఆ ఆలయాలు కనీస ధూపదీప నైవేద్యాలకు నోచుకోకపోవడం విడ్డూరంగా ఉంది. మండల కేంద్రం మోమిన్‌పేటలో పురాతనమైన బాలాజీ, మానిక్ ప్రభు ఆలయాలకు రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని, కానీ ధూపదీప నైవేద్యాలకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న మాన్యం భూములు కౌలుకు ఇవ్వక పోవడం, నిధులలేమితో జాతర మహోత్సవాలను మమ అనిపిస్తున్నారని విమర్శిస్తున్నారు.

కోట్ల ఆస్తులున్నా.. చందాలతో మరమ్మతు

బాలాజీ ఆలయం పూర్తిగా శిథిలా వస్థకు చేరడంతో 15 సంవత్సరాల క్రితం ప్రస్తుత చేవేళ్ల ఎమ్మెల్యే, నాటి టీటీడీ బోర్డు డైరెక్టర్ కాలె యాదయ్య ఆలయ పునర్నిర్మాణం కొరకు రూ.30లక్షలను టీటీడీ నుంచి మంజూరు చేయించారు. ఆ నిధులతోనే ఆలయాన్ని పునర్నిర్మించారు. మాణిక్ ప్రభు ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహాయంతో మరమ్మతులు చేయించారు. ఇన్ని ఆస్తులు ఉన్నా.. కనీస ధూపదీప నైవేద్యాలకు నోచుకోవటం లేదని, చందాలతో ఆలయాల మరమ్మతు చేపట్టడం ఎంత వరకు సబబని, ప్రభుత్వం ఇచ్చే ధూపదీప నైవేద్యం అలవెన్సులు ఏమవుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మాణిక్ ప్రభుకు 42 ఎకరాల మాన్యం..

మాణిక్ ప్రభు దేవాలయం అభివృద్ధి కొరకు కొంత మంది దాతలు 42ఎకరాల 04గుంటల భూమిని అప్పగించారు. కాస్లబాదులోని 46 సర్వేలో 6ఎకరాల32గుంటలు, మోమిన్‌పేటలోని 378లో 6ఎకరాల 11గుంటలు, 381లో 6ఎకరాల 23గుంటలు, 391లో 16ఎకరాల11గుంటలు, 394లో 6ఎకరాల 04గుంటలతో కలిపి మొత్తం 42ఎకరాల 04గుంటల వ్యవసాయ భూమి ఉంది.

వెంకన్నకు 31ఎకరాలు

వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి నిత్య ధూపదీప నైవేద్యాలు సమర్పించేందుకు దాతలు 31ఎకరాల 06గుంటల వ్యవసాయ భూమిని ధారాదత్తం చేశారు. మోమిన్‌పేటలో సర్వే నంబరు 443లో 9ఎకరాల19గుంటలు, 444లో 2ఎకరాల20 గుంటలు, 445లో 2ఎకరాల34గుంటలు, 444లో 16ఎకరాల16గుంటలతో కలిపి మొత్తం 31ఎకరాల06గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆలయాలకు ఇంతటి ఆస్తులు ఉన్నా.. ఆదాయం రావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం దేవాదాయ శాఖ అధికారులు ఈ భూమిని గుర్తించి బోర్డులు పాతి వెళ్లారు. వెంటనే భూములను స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం పాట నిర్వహించి కౌలుకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇదే జరిగితే ఆ ఆలయాలకు ఆదాయం వచ్చి ఆదరణకు నోచుకుంటాయని పలువురు చెప్పారు.



ఆలయ భూములను స్వాధీనం చేసుకొని బోర్డులను పాతిన అధికారులు (ఫైల్)

"భూములు ఉన్న మాట నిజమే

బాలాజీ, మానిక్ ప్రభు మందిరాలకు భూములు ఉన్న మాట నిజమే. ఇంకా వేలం నిర్వహించేందుకు తగిన అనుమతులు రాలేదు. మానిక్ ప్రభు భూములు సాగుకు పనికి రాకుండా ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న భూమిని ఎవరికైనా వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు ఇస్తాం. త్వరలో మాన్యం స్థలాలపై ఆదాయం వచ్చే విధంగా తగిన నిర్ణయం తీసుకుంటాం. విఠలేశ్వర దేవాలయ భూములను వేలం పాట వేస్తున్నాం.

– ఈఓ. నరేందర్, దేవాదాయ శాఖ

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

గణేశ్ ఉత్సవ నిర్వాహకుల సమీక్షలో పోలీసులు

మర్పల్లి: చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షలో సీఐ మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు పర్మిషన్లు తప్పనిసరి అని, డీజేలకు అనుమతి లేదని చెప్పారు. ఉత్సవం నేపథ్యంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున చెరువుల వద్ద వెలుతురు ఉండే విధంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నవాబుపేట: వినాయక మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నవాబుపేట ఎస్సై భరత్ భూషణ్ సూచించారు. వినాయక ఉత్సవ కమిటీలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతియుతంగా పండగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా మండపాల అధ్యక్ష కార్యదర్శులు, నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

నిమజ్జనానికి అనుమతి తప్పనిసరి

ధారూరు: చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం చేయడానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సర్కిల్ సీఐ రామకృష్ణ సూచించారు. 5, 7, 9, 11 రోజుల్లో నిమజ్జనం చేసేవారు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. మంగళవారం పీఎస్ పరిధి అన్ని వర్గాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గణపతులను నెలకొల్పే ముందు అనుమతి లేకుండా మండపాలను ఏర్పాటు చేసి, విగ్రహాన్ని ప్రతిష్ఠించిన నిర్వాహకులు నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, సర్పంచ్ చంద్రమౌళి, ధారూరు పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌గౌడ్, మండల ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి, వివిధ పార్టీల నాయకులు మహ్మద్ బాబాకాన్, అవినాష్‌రెడ్డి, హఫీజ్, అవుసుపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో..

దోమ: గణేశ్ మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు పాటించాలని దోమ ఎస్ఐ రవిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు రాత్రి వేళల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100, 101కు కాల్ చేయాలని చెప్పారు.



మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

ఘనంగా వీరభద్రేశ్వర జయంతి



కొడంగల్ రూరల్: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధారూరు: వీరభద్రేశ్వరస్వామి జయంతి వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వికారాబాద్ వీరశైవ సమాజం యువదళ్ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం కపిలేశ్వరస్వామికి జలం, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి చెన్నబసవయ్యస్వామి భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొడంగల్ రూరల్‌లో

కొడంగల్ రూరల్: వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీరంబపురి జగద్గురు 1008 వీరసోమేశ్వర శివాచార్య మహాస్వామి, రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సంఘం ఆదేశాల మేరకు జయంతిని నిర్వహించారు. భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామికి మడుపతి జగదీష్ స్వామి, చంద్రశేఖర్‌స్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పుష్పార్చన ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.

పరిశుభ్రత అవసరం

పెద్దేముల్: అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, అందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవసరమని ఎంపీడీఓ లక్ష్మప్ప అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం తట్టెపల్లిలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ ఆదేశించారు. గ్రామంలో మూడు రోజుల నుంచి అంతు చిక్కని వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సమస్యలు తలెత్తకుండా మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని, తాగునీటి పైపుల లీకేజీలు ఉంటే వాటికి మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



మోరీలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మాట నిలబెట్టుకునేది కాంగ్రెస్ ఒక్కటే..

- అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ స్కీమ్‌లు
- కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

తాండూరు: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని మాజీ ఎమ్మెల్యే, తాండూరు అసెంబ్లీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అమలు చేసే పథకాలను వివరించే గ్యారంటీ కార్డులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేఎల్ఆర్ మాట్లాడారు. దేశంలో పేద ప్రజల సొంతింటి కల నిజం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు.

కర్ణాటకలో ఇచ్చినట్లుగానే..

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తర్వాత పార్టీ అన్ని విధాలుగా నష్టపోయిందని, ఇప్పుడిప్పుడే పార్టీ చేసిన త్యాగాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని కేఎల్ఆర్ పేర్కొన్నారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన 5 గ్యారంటీ స్కీంలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిందని, తెలంగాణలో సైతం అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు 6 గ్యారెంటీ స్కీంలతో ఎన్నికలకు నగారా మోగించారని తెలిపారు. అంతే కాకుండా చేయూత పథకం ద్వారా వయోజనులకు ప్రతినెల రూ.4వేలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఒక్కరికీ రూ.10లక్షల ఆరోగ్యశ్రీ బీమాను.. పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం అమలు చేయనుందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మధుబాల, మమత, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కావలిసంతోష్, నాయకులు బాతుల వెంకటయ్య, నాగరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాండూరు: గ్యారంటీ కార్డుతో ప్రజలతో మాట్లాడుతున్న రమేష్ మహరాజ్ తదితరులు

గెలుపే లక్ష్యంగా..

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్ మండలం హన్మాపూర్, జైరాంతండా(ఇందూరు), గోట్లపల్లి, గిర్మాపూర్, ధారుణి వాగుతండా తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, బూత్ కమిటి అధ్యక్ష, కార్యదర్శులను పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ సమక్షంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీని తాండూరులో గెలపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. ఇందులో పార్టీ మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నర్సింహులు, మండల బీసీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు నారాయణ, కోఆర్డినేటర్ రాజు, కార్యకర్తలు ఉన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

ఏఐసీసీ చైర్మన్ పవన్ ఖేరా..

అనంతగిరి: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీడబ్ల్యూసీ సభ్యుడు, మీడియా పబ్లిసిటీ ఏఐసీసీ చైర్మన్ పవన్ ఖేరా అన్నారు. స్థానిక గార్డెన్‌లో సోనియాగాంధీ ప్రకటించిన గ్యారంటీ కార్డును ఆవిష్కరించిన అనంతరం.. పట్టణంలోని అనంతగిరిపల్లిలో గడపగడపకు వెళ్లి ప్రజలకు అందజేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ చూసినా పార్టీకి అనుకూలంగా ఉందని, కర్ణాటక రీతిలోనే తెలంగాణలో అధికారం చేపడతామని చెప్పారు. మాజీమంత్రి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సోనియా స్వప్నాన్ని నెరవేర్చాలని కోరారు. ఇందులో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ జెడ్పీటీసీ మహిపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



గ్యారంటీ కార్డును ఆవిష్కరిస్తున్న పవన్ ఖేరా



కొడంగల్: కలాల్‌వాడలో..



పరిగి: వినాయకుడి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు

వాడవాడలా కొలువైన విఘ్నేశ్వరుడు

చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా వాడవాడలా లంబోదరులు కొలువుదీరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వివిధ రూపాల్లో ప్రతిష్ఠంపజేసిన గణనాథులు నిత్యపూజలు అందుకుంటున్నారు. పూజాకార్యక్రమాల్లో భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



తాండూరు రూరల్: చెంగోల్లో..



దోమ: బొంపల్లిలో..



కొడంగల్ రూరల్‌లో..



కొడంగల్ రూరల్‌లో.. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కుల్కచర్లలో..



తాండూరు టౌన్: సాయిపూర్ 11వ వార్డులో

రానున్న ఎన్నికల్లో గెలుపు మాదే..

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీతో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఓటమి తథ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్కాపూర్ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి గౌతపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప ఇంటి వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తాండూరులో కాంగ్రెస్ బలంగా ఉందని, బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. కార్యక్రమంలో రాజు, మల్లేషం, శ్రీను, మల్లేశ్, శివరాజ్, మహేశ్‌గౌడ్, నర్సింహులు, ఎండీ రఫీక్‌లు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో చేపట్టిన దీక్షకు వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు శంకర్, తులసీరామ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్, జిల్లా నాయకులు నరసింహులు, మల్లేశం, పుష్పరాణి, మహేందర్, తిరుపతి ఉన్నారు.